క్లుప్తంగా

కుందుర్పిలో మట్టి నమూనా కేంద్రం ప్రారంభం



మట్టి నమూనాలను పరీక్షిస్తున్న అధికారులు

కుందుర్పి: మండల కేంద్రంలో మట్టి నమూనా కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. అనంతరం (ఐఐఆర్‌టీ) ఢిల్లీ డిజిటల్ గ్రీన్ అధికారుల పర్యవేక్షణలో 10 మంది రైతుల పొలాలకు సంబంధించిన మట్టి నమూనాలను వారు పరీక్ష చేసి, సాగు చేయాల్సిన పంటల వివరాలను రైతులకు తెలియజేశారు. మట్టి పరీక్షలతో పాటు పై సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు సంస్థ పర్యవేక్షణలో రైతులకు సూచనలు సలహాలు అందజేస్తారని సంస్థ అధ్యక్షుడు లక్ష్మీపతి,కోఆర్డినేటర్ నరసింహమూర్తి తదితరులు తెలిపారు.

శుభకార్యం



సత్యం కన్వెన్షన్ హాల్‌లో నిఖాకు హాజరైన మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: స్థానిక సత్యం కన్వెన్షన్ హాల్‌లో ప్రముఖ వ్యాపారి వడ్ల శర్మాస్‌వలి కుమారుడు వడ్ల మహ్మద్ ఇర్ఫాన్ బాషా కుమారుడి నిఖాకు మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ఆదివారం హాజరయ్యారు. ఈసందర్భంగా నూతన వధూవరులను మాజీ ఎమ్మెల్యే విశ్వతో పాటు వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు ఉర్దూ అకాడమీ రాష్ట్ర మాజీ చైర్మన్ నదీం అహ్మద్‌తో వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు వీరన్న మైనార్టీ నాయకులు బళ్లారి ఆసీఫ్ తదితరులు ఆశీర్వదించారు.

10 గ్రామాల్లో మారెమ్మ జాతర

కుందుర్పి: మండలంలోని నిజవల్లి, మలయనూరు, వడ్డెపాళ్యం, మాయదార్లపల్లి, శ్రీమజ్జనపల్లి, తమ్మయ్యదొడ్డి, నాగేపల్లి, శీగలపల్లి, కొల్లారట్టి, బొమ్మాజిపల్లి తదితర గ్రామాల్లో మంగళ, బుధవారాల్లో మారెమ్మ జాతరలు నిర్వహిస్తున్నట్లు సర్పంచులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం గ్రామోత్సవం, గ్రామశాంతి, బుధవారం గావుతీయు కార్యక్రమం, అమ్మవారి ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయని సర్పంచులు గోవిందమ్మ, బొమ్మయ్య, ప్రభాకర్ తదితరులు తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు చూపుతున్న ఎస్‌ఐ నబీరసూల్

బొమ్మనహాళ్: మండలంలోని కల్లుహోళ, బొల్లనగుడ్డం గ్రామాల మధ్య ఉన్న వేదావతి హగరి నది నుంచి ఇసుక తరలిస్తుండగా మూడు ట్రాక్టర్లను శనివారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు. మండలంలోని కల్లుహోళ, బొల్లనగుడ్డం గ్రామాలకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు తోటప్ప, వీరేష్, వెంకటేశులు, మరో ముగ్గురు ట్రాక్టర్ల యజమానులు, ఐదుగురు హమాలీలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బొమ్మనహాళ్: కర్ణాటక ప్రాంతం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఆంజినేయులు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, అతని నుంచి 768 (90 ఎంఎల్) మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నబీరసూల్ ఆదివారం తెలిపారు. కణేకల్లు మండలం కలేకుర్తికి చెందిన ఆంజనేయులు కర్ణాటకలోని రూపనగుడి గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై మద్యం తీసుకెళ్తుండగా, బొల్లనగుడ్డం చెక్‌పోస్టు వద్ద రూ.33,720 విలువజేసే మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కిరాణాషాపులో చోరీ


రాయదుర్గంటౌన్ : పట్టణ శివారులోని కేటీఎస్ డిగ్రీ కళాశాల సమీపంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద నున్న కిరాణా షాపులో శనివారం అర్ధరాత్రి రూ.60 వేల సరుకులు, నగదు దోచుకెళ్లారు. విశ్రాంత ఎంఈఓ రామాంజనేయులు ఓ రేకుల షెడ్డు ఏర్పాటు చేసుకొని జనరల్ స్టోర్‌తోపాటు కిరాణా వ్యాపారం చేస్తున్నాడు. దుండగులు రేకులషెడ్డు వెనుక భాగంలో రేకులను కట్ చేసి, లోపలికి ప్రవేశించి,అందులోని రూ.20 వేల నగదు, సిగరేట్లు, సబ్బులు, ఇతర సరుకులతోపాటు ఒక సీసీ కెమెరా ఎత్తుకెళ్లారు. ఈవిషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

పంపనూరులో పూజలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం పూజలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత స్వామికి ఆకుపూజతో పాటు విశేష పూజలు చేపట్టారు. అనంతరం పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. మంజునాథ స్వామి, పార్వతీ దేవికి పూజలు నిర్వహించి మహా మంగళహారతి అందించారు.

పార్వతీ తనయా నమోనమః

- బహురూపాల్లో కొలువుదీరిన గణనాథులు
- రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో భక్తిశ్రద్ధలతో వినాయక చవితి




రాయదుర్గంలో గొరిల్లాపై వినాయకుడు



కళ్యాణదుర్గం కోటవీధిలో రాయల గణపతి



ఉరవకొండ భోళాశంకరుడి అలంకరణలో గణనాథుడు



రాయదుర్గంలోని హైస్కూల్ మైదానంలో కొలువుదీరిన హిందూ మహాగణపతి



బెళుగుప్పలో వెండి కవచంతో దర్శనమిస్తున్న విఘ్నేశ్వరుడు

రాయదుర్గం /కళ్యాణదుర్గం/ఉరవకొండ: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో వాడవాడలా శుక్ర,శనివారం వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. ఊరూరా మంటపాలకు రంగురంగుల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. మంటపాల ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభతో భక్తులను ఆకట్టుకుంటోంది. భిన్న రూపాల్లో గణాధిపతులు కొలువుదీరగా భక్తులు దర్శించుకుని తరించారు.

రాయదుర్గంలో సకల విఘ్నాలు తొలగించే గణేశ్ నవరాత్రి ఉత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. పండుగ పర్వదినాన్ని ప్రజలు ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. ఊరువాడల్లో గణనాథుడి మంటపాలు ఏర్పాటు చేసి వేద మంత్రోచ్చారణల మధ్య ప్రతిష్ఠించారు.

రాయదుర్గంటౌన్ : రాయదుర్గంలోని వినాయక సర్కిల్, బళ్లారి రోడ్డు, గంగమ్మబావి ఏరియా, తేరుబాజారు, నీలకంఠేశ్వరస్వామి ఆలయం, మార్కండేయ స్వామి ఆలయం, ఓబుళాచారి రోడ్డు, పాండురంగస్వామి ఆలయం, పార్వతీనగర్, బొడ్డు రాయి, వాసవీ కళ్యాణ మంటపం, నేతాజీ రోడ్డు, చౌడేశ్వరిదేవి గుడి, 7వ వార్డు సత్యనారాయణ స్వామి ఆలయం, కోటలోని వెంకటేశ్వరస్వామి ఆలయాల వద్ద, అనంతపురం రహదారిలోని వివిధ ప్రాంతాల్లో వినాయక మంటపాల్లో వివిధ రూపాల్లో గణనాథులు కొలువుదీరారు. దక్షిణ భారతదేశంలోనే అపురూపమైన, అరుదైన దశభుజ మహా గణ పతి ఆలయంలో విశేష పూజలు చేశారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సీఐలు జయనాయక్, వెంకటరమణ బందోబస్తు పర్యవేక్షించారు.

వివిధ రూపాల్లో ఆకట్టుకున్న ప్రతిమలు

కళ్యాణదుర్గం: వాడవాడలా వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల్లో వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. డీఎస్పీ రవిబాబు పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కంబదూరు: మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో వినాయక చవితిని జరుపుకున్నారు. పాత ఎస్సీ కాలనీ, ఆర్డీటీ కాలనీ, గుండ్లపల్లి కాలనీ, ఎన్‌టీఆర్ సర్కిల్, తులసమ్మ వీధి, బాగేపల్లి వీధి తదితర కాలనీల్లో వివిధ ఆకృతుల్లో ఉన్న అతిపెద్ద వినాయక విగ్రహాలు కొలువుదీరాయి. మల్లేశ్వరస్వామి ఆలయంలో వెండి ఆభరణాల వినాయకుడు ఆకట్టుకున్నాడు.

కూడేరు: కూడేరు మండల వ్యాప్తంగా శనివారం వినాయక చవితిని ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేశారు. రెండోరోజు ఆదివారం వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు.

గుమ్మఘట్ట మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా వెలసిన వినాయకున్ని చలువపందిళ్ల కింద కొలువుదీర్చి, పూజలు నిర్వహించారు.

కణేకల్లు: కణేకల్లులో వినాయక చవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంటపాల్లో వినాయకులను ప్రతిష్ఠించి, ఉండ్రాళ్లను నైవేద్యాలుగా పెట్టి పూజలు చేశారు. చిక్కణ్ణేశ్వరస్వామి, స్వయంభేశ్వరస్వామి, సిద్ధేశ్వరస్వామి, దేవమ్మ దేవి ఆలయం, రామనగర్, నేసేపేట, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో వినాయకులు కొలువుదీరారు.

వజ్రకరూరు మండల వ్యాప్తంగా శని, ఆదివారాల్లో వినాయక చవితి వేడుకలు వైభవంగా నిర్వహించారు. వజ్రకరూరులోని అన్ని వీధుల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కుందుర్పి: కుందుర్పి మండల వ్యాప్తంగా శనివారం వినాయక చివితి ఘనంగా జరుపుకున్నారు. సోమవారం అన్ని గ్రామాల్లోనూ నిమజ్జనం చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

శెట్టూరు: శెట్టూరు మండలంలోని మండలంలోని శెట్టూరు, అయ్యగార్లపల్లి, బచ్చేహళ్లి, యాటకల్లు, ఐదుకల్లు, ములకలేడు, కనుకూరు, చిన్నంపల్లి, తిప్పనపల్లి, లక్ష్మంపల్లి, మాకొడికి, చింతర్లపల్లి, పెరుగుపాళ్యం, అనుంపల్లి గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో వినాయక చవితి నిర్వహించారు.

బెళుగుప్ప మండల వ్యాప్తంగా గుండ్లపల్లి, జీడిపల్లి, నక్కలపల్లి, నరసాపురం, యలగలవంక, వెంకటాద్రిపల్లి, విరుపాపల్లి, రమణేపల్లి, హనిమరెడ్డిపల్లి, బెళుగుప్ప తండా, గంగవరం, రామసాగరం, అంకంపల్లి, జీడిపల్లి, కాలువపల్లి, ఆవులెన్న, శీర్పి, ఎర్రగుడి, దుద్దేకుంట, తగ్గుపర్తి గ్రామాల్లో పూజలు చేశారు. గణనాథులకు ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. బెళుగుప్పలోని విఘ్నేశ్వరస్వామి ఆలయంలో పంచలోహ ఉత్సవ విగ్రహంతో ప్రాకారోత్సవపూజలు చేశారు.

దండాలయ్యా ఉండ్రాళ్లయ్యా...

ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వినాయక విగ్రహాలను భారీ ఊరేగింపు మధ్య మంటపాలకు తరలించి, బొజ్జగణపయ్యలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ నగర్ జమన్నకట్ట వద్ద పదివేల చాక్లెట్లతో వినాయకుడిని తయారు చేశారు. చెంగలవీధిలో 200 కేజీల బెల్లంతో వినాయకుడు కొలువుతీరాడు. అంబేడ్కర్ నగర్ మొదటి క్రాస్‌లో అరణ్యంలో ఉన్న భోళా శంకరుడిగా, ఇందిరానగర్ మొదటి క్రాస్‌లో కాంతార వినాయకుడి రూపంలో ఆకట్టుకుంటున్నాడు. అయ్యప్పస్వామి ఆలయంలో అనంతపద్మనాభస్వామి అలంకరణలో దర్శనమిచ్చాడు.

బొమ్మనహాళ్: బొమ్మనహాళ్ మండలంలో వినాయక చవితిని వాడవాడలా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. బొమ్మనహాళ్‌తో పాటు ఉద్దేహాళ్, దర్గాహొన్నూరు, గోవిందవాడ, శ్రీధరఘట్ట, ఎల్‌బీ నగర్, గోనేహాళ్, దేవగిరి, ఉంతకల్లు, నేమకల్లు, కృష్ణాపురం, లింగదహాళ్, శింగానహళ్లి, బొల్లనగుడ్డం, సిద్దరాంపురం, శింగానహళ్లి తదితర గ్రామాల్లో విగ్రహాలను ఏర్పాటు చేశారు.

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం పట్టణంలో వినాయ చవితి సందర్భంగా గణపతి విగ్రహాలు వాడవాడలా ఏర్పాటు చేశారు. వాల్మీకి సర్కిల్, విద్యానగర్, కాలేజ్‌రోడ్డు, దొడగట్ట రోడ్డులో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను ప్రజలు దర్శించుకున్నారు. సోమవారం వినాయకుడిని నిమజ్జనం చేస్తారు.



కళ్యాణదుర్గం కొల్లాపురమ్మ వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడు



కూడేరు: ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం



రాయదుర్గంలో కృష్ణాశ్రమంవద్ద బాలగణేశుడు



కంబదూరులో కొలువుదీరిన గణేశుడు



వజ్రకరూరు సీతారామస్వామి ఆలయంవద్ద ..



కణేకల్లు చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ...



శెట్టూరులో కొలువు దీరిన వినాయకుడు



కళ్యాణదుర్గంలోని వాల్మీకి సర్కిల్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడు



ఉద్దేహాళ్‌లో వినాయకుడికి పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు



ఉరవకొండలోని జమ్మిమానుకట్ట వద్ద చాక్లెట్లతో తయారు చేసిన వినాయకుడు



కళ్యాణదుర్గంలో పూజలందుకుంటున్న గణపతి



కుందుర్పిలోని ఎమ్మార్సీ వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడు



ఉరవకొండ అంబేడ్కర్ నగర్‌లో శ్రీరాముడి అలంకరణలో విల్లుతో...

తూకం..మోసం

- చౌకధాన్యపు డిపోల్లో డీలర్ల చేతివాటం
- డబ్బాల్లో బియ్యం తూకంతో గోల్‌మాల్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని చౌకధాన్యపు డిపోల్లో బియ్యం పంపిణీలో డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. తూకాల్లో మోసం చేస్తూ 10 కేజీలకు ఒక కేజీ బియ్యం కాజేస్తున్నారు. ఎలక్ట్రానిక్ మిషన్లలో నేరుగా లబ్ధిదారులు తెచ్చిన సంచుల్లో బియ్యం వేసి తూకం వేయాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా డబ్బాల్లో వేసి తక్కువ తూకంతో బియ్యం మిగుల్చుకుంటూ పక్కదారి పట్టిస్తున్నారు. మిషన్‌పై డబ్బా పెట్టినా దాన్ని జీరో చేయకుండా నేరుగా తూకం వేస్తూ, మోసానికి పాల్పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా బియ్యం తూకాల్లో గోల్‌మాల్ చేస్తూ పేదల బియ్యాన్ని నొక్కుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. బియ్యం తూకాల్లో కోత లేకుండా సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు. డీలర్లు యథేచ్ఛగా బియ్యం దోపిడీ చేస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలోని 23 చౌకధాన్యపు డిపోలు ఉన్నాయి. మరోవైపు పట్టణంలో ఇంటింటికీ రేషన్ వాహనాలు రాకపోవడంతో లబ్ధిదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన మరుసటి నెల నుంచి కొందరు పాత డీలర్లపై రాజకీయ ఒత్తిళ్లతో వారిని తొలగించి, టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కట్టబెట్టారు. ఇలా దాదాపు ఇప్పటి దాకా 11 ఎఫ్‌పీ షాపు డీలర్లను తొలగించి, ఇతరులకు కేటాయించగా మరో నాలుగైదు డీలర్లు స్వచ్ఛందంగా తప్పుకోకపోవడంతో



రాయదుర్గం పట్టణంలోని 1వ వార్డు పార్వతీనగర్‌లోని ఎఫ్‌పీ షాపులో డబ్బాలతో తూకం వేస్తున్న దృశ్యం



6,9 వార్డుల పరిధిలోని 13వ డిపోలో డబ్బాలో బియ్యం తూకం

క్షేత్రస్థాయిలో తనిఖీ చేస్తాం



ఎట్టి పరిస్థితుల్లో డబ్బాలతో తూకం వేయరాదు. బియ్యం తూకంలో తక్కువ వచ్చినట్లు ఎవరి నుంచైనా ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం. చౌకధాన్యపు డిపోలను క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి, పేదలు నష్టపోకుండా చూస్తాం. ఎవరైనా డీలర్లు మోసాలకు పాల్పడితే విచారించి చర్యలు చేపడుతాం.

– ఫణికుమార్, ఇన్‌చార్జ్ తహసీల్దార్, రాయదుర్గం

ఊసేలేని మానిటరింగ్ కమిటీ సమావేశాలు

- పెండింగ్‌లో ఎస్సీ,ఎస్టీ సమస్యలు
- నీరుగారుతున్న జస్టిస్ కె.పున్నయ్య కమిషన్ సిఫార్సులు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్లో సబ్ డివిజనల్ ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలపై అధికారులు ఊసెత్తడంలేదు. డైరెక్టరేట్ ఆఫ్ సోషల్ వెల్ఫేర్ అధికారుల నుంచి ప్రతి మూడు నెలలకోసారి సమావేశాలు నిర్వహించాలని ఉత్తర్వులు ఇచ్చినా అధికారుల నిర్లక్ష్యంతో సమావేశాలు జరగలేదు. దీంతో సబ్ డివిజనల్ స్థాయిలో వందకు పైగా ఎస్సీ, ఎస్టీ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి.

మూన్నెళ్లకోసారి సమావేశాలు జరగాలి..

ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు, అంటరానితనం, కులవివక్షను రూపుమాపేందుకు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో జస్టిస్ కె.పున్నయ్య కమిషన్ ఏర్పాటైంది. తద్వారా పెత్తందారుల కంబంధ హస్తాల నుంచి తమను తాము రక్షించుకుంటూ సామాజిక భద్రత సాధించే దిశగా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. సబ్ డివిజన్ స్థాయిలో ఆర్డీఓ చైర్మన్‌గానూ, మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కార్యదర్శిగానూ, తహసీల్దార్లు, ఏఎస్‌డబ్ల్యూఓ, పోలీసులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు సభ్యులుగా, ఎస్సీ, ఎస్టీ సామాజిక కార్యకర్తలను సభ్యులుగా కమిటీని రూపొందించారు. ప్రతి మూడు నెలలకోసారి డివిజన్ స్థాయిలో ఈ కమిటీ సమావేశం జరగాల్సి ఉంది. అయితే ఇప్పటివరకూ సమావేశాలే నిర్వహించలేదు.



కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ కార్యాలయం

పరిహారం అందించడంలోనూ అలసత్వం..

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక భద్రత దిశగా అందించాల్సిన నష్టపరిహారం అందించడంలోనూ అధికారులు అలసత్వమే ప్రదర్శిస్తున్నారు. కేసు నమోదైనప్పటి నుంచి ఛార్జ్‌షీట్ వేసే సమయానికి నిర్ణయించిన పరిహారం మేరకు 70 శాతం బాధితులకు అందాల్సి ఉంది. సబ్ డివిజన్ స్థాయిలో 118 కేసులకు సంబంధించి రూ.50 లక్షలు పరిహారం అందాల్సి ఉంది. సమావేశాలు జరిగితేనే పరిహారం అందే అవకాశం ఉందని, దీనిపై ఆయా శాఖల అధికారులు సమన్వయంతో సమావేశాలు నిర్వహించాలని ఎస్సీ, ఎస్టీలు కోరుతున్నారు.

త్వరలో సమావేశాలు నిర్వహిస్తాం

ఇటీవలే డివిజన్ స్థాయిలో మీటింగ్ నిర్వహణకు ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లాం. నూతన కమిటీ ఎన్నికలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయి. కమిటీ ఏర్పాటు కాగానే కేసుల పరిష్కారం, బాధితులకు పరిహారంపై దృష్టి సారిస్తాం.

– దామోదర్ రెడ్డి, ఏఎస్‌డబ్ల్యూఓ, సాంఘిక సంక్షేమశాఖ, కళ్యాణదుర్గం

గుండెపోటుతో సీపీఐ సహాయ కార్యదర్శి మృతి

రాయదుర్గంటౌన్: నియోజకవర్గ సీపీఐ సహాయ కార్యదర్శి వడ్డే గురుస్వామి (48) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పట్టణంలోని బళ్లారి బస్టాండ్ వద్ద గుండెపోటు వచ్చింది. బంధువులు, సీపీఐ నాయకులు చికిత్స కోసం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉంది. కుటుంబ సభ్యులను నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాగార్జున, నాయకులు, కార్యకర్తలు, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఓదార్చారు.

లడ్డూ వేలంలో పాల్గొనండి

అనంతపురం కల్చరల్: నగరంలోని బళ్లారి రోడ్డు సత్యదేవనగర్‌లో వెలసిన గణనాథుడి వినాయక ఉత్సవాలు ఐదురోజుల పాటూ జరగనున్నాయి. చివరి రోజు లడ్డూ వేలం వేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి రూపంలో విశేషంగా ఆకట్టుకునే రూపంలో ఏర్పాటు చేసిన ఉత్సవం వద్ద ఆదివారం ప్రత్యేక సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా సత్యదేవనగర్ వినాయక చవితి మిత్రబృందం మాట్లాడుతూ.. 42 ఏళ్లగా ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈసారి తిరుమల శ్రీవారి లడ్డూను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని తెలిపారు. ఐదవ రోజు లడ్డూ వేలం వేస్తున్నట్లు వెల్లడించారు.

గిరిజన గురుకుల విద్యార్థినులకు రక్షణేదీ?

- అరకొర వసతులతో ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న పాఠశాల
- పాఠశాలకు ప్రహరీ లేక ఆకతాయిల బెడద

ఉరవకొండ: పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు రక్షణ కరువైంది. ఓ ప్రైవేట్ భవనంలో అరకొర వసతుల మధ్య పాఠశాల కొనసాగుతోంది. పాఠశాలలో విద్యార్థినుల అవస్థలు వర్ణనాతీతం. రాయంపల్లి రోడ్డు వద్ద కొనసాగుతున్న పాఠశాల భవనానికి ప్రహరీ లేదు. సాయంత్రం ఏడు గంటల అయితే చాలు.. మందు బాబులు పాఠశాల సమీపంలో కూర్చొని మద్యం సేవిస్తుండటంతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. మందుబాబులు అర్ధరాత్రి వరకు అక్కడే ఉండటం, దీనికి తోడు కొందరు ఆకతాయిలు పాఠశాల సమీపంలోనే కూర్చొని కాలక్షేపం చేస్తున్నారు. పట్టణానికి దూరంగా ఉన్న ఈ పాఠశాలలో విషసర్పాలు తరచూ కనిపిస్తున్నాయని విద్యార్థినుల తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాలలో 3 వ తగరతి నుంచి 10 తరగతి వరుకు 232 మంది విద్యార్థినులు ఉన్నారు.



ఉరవకొండలోని గిరిజన గురుకుల పాఠశాల కొనసాగుతున్న ప్రైవేట్ భవనం

సొంత భవనం ఉన్నా అద్దె భవనంలో పాఠశాల:

గిరిజన గురకులానికి పట్టణ నడిబొడ్డులో సొంత భవనం ఉంది. అయితే గ్రామానికి చివరన భద్రత లేని చోట ఓ ప్రైవేట్ భవనంలో పాఠశాల నిర్వహిస్తున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.50 లక్షల వ్యయంతో పాఠశాలలో అన్ని వసతులూ కల్పించారు. అయినా అక్కడ ఉండకుండా రాజకీయ ఒత్తిళ్లతో అద్దె భవనంలోకి మార్చారు. ప్రస్తుతం ఉన్న అద్దె భవనంలో విద్యార్థినులు వినియోగించే బాత్‌రూంలకు తలుపులు లేవు. దీంతో విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. అద్దె భవనంలో ఉన్న పాఠశాలకు ప్రహరీ ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ అరుణదేవిని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరినా పట్టించుకోలేదు. దీంతో వారు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నారు.

పోలీసులు గస్తీ తిరిగేలా చూస్తాం

ఉరవకొండ గిరిజన గురుకుల బాలికల పాఠశాలకు కాంపౌండ్ వాల్ లేకపోవడంతో రక్షణ లేకుండా పోయింది. మందు బాబులు, ఆకతాయిలు పాఠశాల వద్దకు రాకుండా పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. పోలీసులు గస్తీ తిరిగేలా చర్యలు తీసుకుంటాం. గురుకుల భవన నిర్మాణానికి స్థల సేకరణ చేస్తున్నాం.

– రామాంజి, జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి, అనంతపురం

రైతుల సంక్షేమం పట్టని కూటమి ప్రభుత్వం

- ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప: కూటమి ప్రభుత్వానికి రైతాంగ సమస్యలు, వారి సంక్షేమం పట్టలేదని, గతేడాది పంటల బీమా ప్రకటించలేదని, నేటికీ రైతు భరోసాపై స్పష్టత ఇవ్వలేదని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీనివాస గార్డెన్‌లో పార్టీ మండల కన్వీనర్ మచ్చన్న అధ్యక్షతన నిర్వహించిన వైఎస్సార్‌సీపీ మండల స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న హాజరయ్యారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే విశ్వ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రెండేళ్ల పాటు కరోనా విపత్కర పరిస్థితులతో సుమారు రూ.1.2 లక్షల కోట్లు ప్రభుత్వానికి రాబడి తగ్గినా, సంక్షేమ పథకాలను ఆపకుండా అమలు చేశారన్నారు. దేశంలో ఎన్నికల ఎలక్ట్రానిక్ పోలింగ్ మిషన్‌లలో 6శాతం తేడా ఉంటే మన ఆంధ్రప్రదేశ్‌లో అయితే 12 శాతం తేడా ఉండటంతో ఈవీఎంలపై అనుమానాలు వచ్చాయన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమమం అభివృద్ధి రెండింటిని అమలు చేస్తూ విద్య,వైద్యం రంగంలో నూతన ఒరబడి తీసుకువచ్చారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

రాష్ట్రంలో సామాజిక పింఛన్లు 65 లక్షల మందికి 1వ తేదీనే లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పంపిణీ చేసినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు త్రిలోక్‌రెడ్డి, ఏడీసీసీబీ మాజీ డైరెక్టర్ శివలింగప్ప, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాస్, సర్పంచులు రామిరెడ్డి, రమేష్, రుద్రానంద, ఎంపీటీసీలు సురేష్, వీరబొమ్మ , మాజీ సహకార సంఘ అధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు రామేశ్వరరెడ్డి, రాజగోపాల్, శ్రీనివాసరెడ్డి, ముత్యాలరెడ్డి, మారుతీరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గోవిందరెడ్డి, కేశవరెడ్డి, వేణుగోపాల్, నరిగన్న, అంగడి ఎర్రిస్వామి, పాల తిప్పేస్వామి, పూల ప్రసాద్,శ్రీనివాసనాయక్, గాంగ్యానాయక్, సుంకానాయక్, రాము తదితరులు పాల్గొన్నారు.